క్లుప్తంగా

సుప్రీంకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్‌కు పుస్తక బహూకరణ


జస్టిస్ ఎన్.వీ.రమణకు పుస్తకాన్ని బహూకరిస్తున్న డాక్టర్ చిక్కా దేవదాసు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వీ.రమణకు ''ది పాత్‌టు హ్యూమానిటీ'' పుస్తకాన్ని బహూకరించినట్లు చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిక్కా దేవదాసులు అన్నారు. ఆయన ఇటీవల నగరానికి వచ్చిన సందర్భంగా పుస్తకాన్ని బహూకరించినట్లు మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరించారు. చేనేత వర్గాల సమస్యలను కూడా మాజీ చీఫ్ జస్టిస్ రమణ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా గురునాథ్ నాయక్



అబిడ్స్: గోషామహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా కె.గురునాథ్ నాయక్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత సంవత్సర కాలం పాటు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ ధనలక్ష్మి షీ టీమ్‌కు బదిలీ కావడంతో ఆమె స్థానంలో మొగల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో డీఐగా విధులు నిర్వహిస్తున్న కె.గురునాథ్ నాయక్‌ను పోలీస్ కమిషనర్ నియమించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన గురునాథ్ నాయక్ గతంలో నిజామాబాద్, బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. ట్రాఫిక్ ఉన్నతాధికారుల సూచనల మేరకు ట్రాఫిక్ కంట్రోలింగ్, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించేందుకు, అక్రమ పార్కింగ్‌లను నిరోధించేందుకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు.

మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా మద్ది ప్రవీణ్‌కుమార్



మలక్‌పేట: మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా మద్ది ప్రవీణ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన జ్యోత్స్న భరోసా సెంటర్‌కు బదిలీ కావడంతో టాస్క్‌ఫోర్స్ విభాగంలో అడ్మిన్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్ ఆమె స్థానంలో బదిలీపై మలక్‌పేట వచ్చారు. 2004 బ్యాచ్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ మొట్టమొదట మాడ్గుల పీఎస్‌లో పోస్టింగ్ తీసుకున్నారు. గద్వాల గట్టు పోలీస్‌స్టేషన్, ఎస్‌బీఐ విభాగం, అఫ్జల్‌గంజ్ పీఎస్‌లో డీఐగా, కామాండ్ కంట్రోల్, ఐటీ సెల్ విభాగాలలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. భద్రత, సురక్షిత ప్రయాణం కోసం ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ నూతన కమిటీ ఏర్పాటు

సైదాబాద్: మలక్‌పేట బీ బ్లాక్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ చైర్మన్‌గా బచ్చు గంగాధర్ ఎన్నికయ్యారు. దేవాలయ మాజీ చైర్మన్ గూండా మల్లయ్య ఆధ్వర్యంలో మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎం.అయిలయ్య, ప్రధాన కార్యదర్శిగా పాల మధుసూధన్, సంయుక్త కార్యదర్శిగా సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా డాక్టర్ ఎస్.విజయ్‌భాస్కర్, కోశాధికారిగా పి.శంకర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలువురు దేవాలయ ట్రస్టీలు పాల్గొన్నారు.

మార్కెట్ గార్బేజీ కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీసులు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ గార్బేజీ కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు మంగళవారం మార్కెట్ అధికారులు తెలిపారు. నెల రోజులుగా మార్కెట్ లోని చెత్త లిఫ్టింగ్‌లో అలసత్వం వహించడంతో ఇప్పటికే మూడుసార్లు నోటీసులు జారీ చేశారు. త్వరలో కాంట్రాక్ట్ రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలవనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

గార్బేజీ లిఫ్టింగ్‌కు నెలకు రూ.3.25 లక్షలు

గార్బేజీ లిఫ్టింగ్ నిమిత్తం రూ. 3.25 లక్షలు మార్కెట్ కమిటీ చెల్లిస్తుండగా సదరు కాంట్రాక్టర్ మార్కెట్ ప్రాంగణాన్ని శుభ్రం చేయడం లేదని పలువురు వ్యాపారులు, రైతులు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వార్డు కార్యాలయాలకు సన్నాహాలు!

- నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌కు వార్డు కార్యాలయం
- అభ్యంతరాలతో ఏర్పాటుకు ఆలస్యం
- కార్యాలయాల ఏర్పాటుతో ప్రజా సమస్యల పరిష్కారం


జీహెచ్ఎంసీ సర్కిల్ -16 కార్యాలయం

అంబర్‌పేట: ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారానికి జీహెచ్ఎంసీ సన్నద్ధమౌతుంది. వార్డు స్థాయిలోనే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు వార్డు కార్యాలయాలను జీహెచ్ఎంసీ అంబర్‌పేట్ సర్కిల్–16 అధికారులు సిద్ధపడుతున్నారు. నియోజకవర్గంలో ఉన్న ఐదు వార్డుల్లో కార్యాలయాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి అధికారులు అందుబాటులో ఉండనున్నారు.

- ఇటీవల జీహెఎంసీ ఉన్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రజల వద్దకు పాలన అనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వార్డు కార్యాలయాలను గుర్తించే పనిలో సర్కిల్–16 అధికారులు నిమగ్నమయ్యారు.

దూరంగా సర్కిల్ కార్యాలయం...

- నియోజకవర్గ ప్రజలకు ప్రధాన మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారంలో జీహెచ్ఎంసీ విభాగానిదే కీలకపాత్ర. రోడ్లు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, హార్టికల్చర్, పాదుపు సంఘాల నిర్వహణ, టౌన్‌ప్లానింగ్, వర్షపు నీటినాలాల నిర్వహణ వంటి సేవలను అందించడం జరుగుతుంది.
- కీలక సేవలందించే జీహెచ్ఎంసీ సర్కిల్– 16 కార్యాలయం అబిడ్స్‌లో ఉండటంతో గత కొన్నేళ్లుగా అంబర్‌పేట ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న సమస్య వచ్చినా ప్రజలు అబిడ్స్ వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- గతంలో సర్కిల్ కార్యాలయాన్ని స్థానికంగా ఏర్పాటు చేసేందుకు ప్రజా ప్రతినిధులు అనేకసార్లు వాగ్దానాలు చేసి విస్మరించారు. తాజాగా వార్డు కార్యాలయాలతో క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండటంతో కొంత ప్రజలకు ఉపశమనం కలుగుతుంది.

వార్డు కార్యాలయాల ప్రతిపాదనలు ఇవే..?

- కాచిగూడ డివిజన్‌కు వెంకటరమణకాలనీలో ఉన్న జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం, గోల్నాక డివిజన్‌కు నెహ్రూనగర్‌లో ఉన్న వార్డు కార్యాలయం, బాగ్అంబర్‌పేట్ డివిజన్‌కు రామకృష్ణానగర్ పార్కులో కమ్యూనిటీహాల్, నల్లకుంట డివిజన్‌కు తిలక్‌నగర్‌పార్కులో ఉన్న కార్యాలయం, అంబర్‌పేట డివిజన్‌కు మున్సిపల్ గ్రౌండ్‌లో ఉన్న కార్యాలయాలను అధికారులు ప్రాథమికంగా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఇందులో కొన్నింటికి స్థానికంగా అభ్యంతరాలు వస్తున్నాయి. దీంతో అధికారులు జీహెచ్ఎంసీకి సంబంధించిన కార్యాలయాల్లోనే జీహెచ్ఎంసీ పాలన కోసం కార్యాలయం ఏర్పాటు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం.

అందుబాటులోకి వస్తే హర్షం..

- నియోజకవర్గంలో ఉన్న ఐదు డివిజన్‌లలో వార్డు కార్యాలయాలు అందుబాటులోకి వస్తే ప్రజల ఇబ్బందులు సత్వర పరిష్కారానికి నోచుకుంటాయి. ఏ చిన్న సమస్య తలెత్తినా ప్రజలు అందుబాటులో ఉన్న వార్డు కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది.
- వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసే అందులో క్షేత్ర స్థాయిలో ఏఈ స్థాయి ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎఫ్ఏలు, వీధిదీపాల ఏఈలు అందుబాటులో ఉంటారు. వీరికి సూపరింటెండెంట్ స్థాయి అధికారి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారు.

పవర్‌బోర్ పనులు ప్రారంభం


బర్కత్‌పురలో పవర్ బోర్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల్లో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో పవర్ బోర్స్, హ్యాండ్‌బోర్ పంపులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శ్రీజైన్ శ్వేతాంబర్ తపగచ్చి సంఘం విజ్ఞప్తి మేరకు కాచిగూడ డివిజన్ బర్కత్‌పురలో తన సొంత నిధులతో ఏర్పాటు చేయనున్న పవర్ బోర్ పనులను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు జలమండలి ద్వారా అవసరమైన పనులను చేపడుతున్నామన్నారు. నీటి ఎద్దడి ఉన్నట్లు గుర్తించిన ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల్లో చెడిపోయిన హ్యాండ్ బోర్స్, పవర్ బోర్స్‌కు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకువస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, ఓంప్రకాష్‌యాదవ్, శిరీష, శ్రీకాంత్, సంతోష్, ప్రవీణ్ ఓరా, ఉపేందర్, వికాస్ జైన్, పంకజ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ పోస్టర్ ఆవిష్కరణ



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: డీవైఎఫ్ఐ కేంద్ర కమిటీ సమావేశాల పోస్టర్‌ను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంగళవారం డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ , కార్యదర్శి ఆనగంటి వెంకటేష్‌లు మాట్లాడుతూ.. మే 26న విద్య, ఉపాధి, పర్యావరణం అంశాలపై సెమినార్‌ను నిర్వహిస్తున్నామని, ఈ సెమినార్‌కు డీవైఎఫ్ఐ ఆలిండియా కార్యదర్శి హిమాగ్నరాజ్ భట్టాచార్య, ఎమ్మెల్సీ నర్సిరెడ్డిలు హాజరౌతారని తెలిపారు. 27, 28న దేశంలో జరగుతున్న వివిధ అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.డీ.జావేద్, నాయకులు శివ, రఘు, శ్రీమాన్, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

అంబర్‌పేట: జైస్వాల్ గార్డెన్‌లో అంతర్గత రోడ్ల సమస్యను పరిష్కరించాలంటూ కాలనీ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ జీహెచ్ఎంసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి కాలనీలో నాలుగైదు ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేసినా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని ఇంజినీర్ దృష్టికి శ్రీనివాస్ తీసుకెళ్లారు. అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్ల పరిస్థితిని వివరించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరినట్టు సమాచారం.



బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి


అడ్డగుట్టలో సంతకాల సేకరణ చేపడుతున్న దృశ్యం

అడ్డగుట్ట: రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడుతున్న బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ఐద్వా నగర కమిటీ కార్యదర్శి నాగలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అడ్డగుట్టలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జోన్ కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ.. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్న డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ గౌరవాన్ని శిఖర స్థాయిలో నిలిపే రెజ్లర్లపై ఈ విధమైన చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కమిటీ సభ్యులు అంజమ్మ, పద్మ, స్వరూప, అలేఖ్య, సుధా, రాణి, యాకమ్మ, మదర్ బి, మాలతి, అనూష, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే దానం నాగేందర్

హిమాయత్‌నగర్: బస్తీలు, కాలనీల్లో మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని పలు రహదారులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కాలనీల్లో రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సాహితీ శిఖరం కేతు విశ్వనాథరెడ్డి

లిబర్టీ: తెలుగు సాహిత్యానికి వెలుగులు నింపిన సాహితీ శిఖరం కేతు విశ్వనాథ రెడ్డి అని అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్ కన్వీనర్ గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ అన్నారు. ఎన్నో రచనలతో తెలుగు ప్రజల హృదయాల్లో తన పేరును సుసంపన్నం చేసుకున్నారన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి రచనలు గుర్తించి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును ప్రదానం చేసిందన్నారు. ఆయన వివిధ హోదాల్లో అభ్యుదయ రచయితల సంఘానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ప్రధానంగా రాయలసీమ సాహిత్య ఉద్యమ కార్యాచరణలో కేతు విశ్వనాథ రెడ్డి పాత్ర గొప్పదన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్య విధానాన్ని ప్రవేశపెట్టాలి


మాట్లాడుతున్న సదానందరెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలని ఈనెల 24న ఉదయం 10 గంటలకు ఇందిరా పార్కులోని ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ అధ్యక్షుడు సదానందరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24న నిర్వహించే నిరాహార దీక్షకు విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు, రాజకీయ నాయకులు, ఉద్యమకారులు, మేధావులు, కవులు, కళాకారులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఉచిత విద్య వైద్య సాధన సమితి అధ్యక్షులు నారగోని ప్రవీణ్‌కుమార్, నర్సింహాగౌడ్, వెంకటేశ్వర్, ధానమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నారాయణగూడ ఎస్‌హెచ్‌ఓగా శ్రీనివాస్



హిమాయత్‌నగర్: నారాయణగూడ ఎస్‌హెచ్‌ఓగా గుండమల్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో శివరామకృష్ణ ఇక్కడికి బదిలీ అయ్యారు. అయితే అనువార్య కారణాల నేపథ్యంలో ఆయనను శివరామకృష్ణ ఫిల్మ్‌నగర్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఫిల్మ్‌నగర్‌లో బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను నారాయణగూడ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. 1996 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్ కొద్దిరోజుల క్రితం వరకు ఎస్బీలో వెస్ట్ జోన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు.

న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలి


మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

సుల్తాన్‌బజార్: న్యాయవాదులపై దాడుల నివారణకు న్యాయవాదుల సంరక్షణ చట్టం తీసుకురావాలని బార్‌కౌన్సిల్ సభ్యులు కొండారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భారత ప్రజా న్యాయవాదుల సంస్థ, లాయర్స్ కౌన్సిల్ పౌరహక్కుల సంఘం, పీయూసీఎల్, బార్‌కౌన్సిల్ సభ్యులు మాట్లాడారు. ఇటీవల నల్గొండ జిల్లా తిరుమలగిరిలో యువ న్యాయవాది యుగేందర్‌పై స్థానిక ఎమ్మెల్యే అనుచరులు దాడిచేశారని ఆరోపించారు. అలాగే మరో ఘటనలో చర్లపల్లి సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్ అనే జైలర్ న్యాయవాది డి.సురేష్‌కుమార్‌పై నిందపూర్వకంగా పత్రికా ప్రకటన ఇవ్వడాన్ని ఆయా సంఘాల నాయకులు ఖండించారు. ఈ సమావేశంలో సైదారావు, ఉపాధ్యక్షుడు వెంకన్న, నారాయణరావు, విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కాచిగూడ: ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వేస్టేషన్ వెనుక వైపు ఓ గుర్తుతెలియని మహిళ (40) మృతి చెంది ఉంది. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటర్ల నమోదు ప్రక్రియ ఇంటింటా చేపట్టండి


బీఎల్ఓల సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా తయారీని ఇంటింటా తిరిగి అధికారులు చేపట్టాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలోని 235 పోలింగ్ బూతులలో బీఎల్ఓలు ఇంటింటా ప్రతిరోజూ పర్యటించి అర్హులైన వారి ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. మంగళవారం జరిగిన బీఎల్ఓల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా తయారి, కొత్త ఓటర్లకు అవగాహన కల్పించడం, అడ్రస్సులు మారిన వారి పేర్లు తొలగించడం తప్పొప్పులను సరిదిద్దడం వంటి ప్రక్రియలన్నీ బీఎల్ఓలు బస్తీలు, ప్రాంతాల్లో పర్యటించి విజయవంతంగా చేపట్టాలన్నారు. బీఎల్ఓల పాత్ర ఓటర్ల నమోదులో ఎంతో కీలకమన్నారు. ప్రతి భవనాన్ని, అధిక ఓటర్లు ఉన్న ఇళ్లల్లో, కాంప్లెక్సులు, బహుళ అంతస్థులు, బహుళ అంతస్థులలో బీఎల్ఓలు చిరునామాలా ప్రకారం.. పర్యటించి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా మెరుగుకు చర్యలు

దిల్‌సుఖ్‌నగర్: వేసవి నేపథ్యంలో డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని మార్గదర్శికాలనీ, ఎన్‌టీఆర్‌నగర్ తదితర కాలనీల్లో పర్యటించారు. కాలనీలు, బస్తీల్లో తాగునీటి సరఫరా సరిగ్గా జరుగక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ ఆయా ప్రాంతాల్లో అదనపు వాల్వ్‌లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

మలక్‌పేట: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటానని మూసారంబాగ్ కార్పొరేటర్ భొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లో పర్యటించిన ఆమె కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శాలివాహననగర్ మాక్సివిజన్ లైన్‌లో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నిండి రెండు రోజులుగా మురుగునీరు రోడ్డుపై పారుతోందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు.. సమస్య తీవ్రతను గుర్తించిన ఆమె వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ పొంగిపొర్లకుండా సీవరేజ్ సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులకు నిర్లక్ష్యం వహించరాదన్నారు. కాలనీలో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు యాదగిరి, షకీల్, జీహెచ్ఎంసీ సత్తిరెడ్డి, కాలనీవాసులు రామకృష్ణ, కృష్ణమూర్తి, నాయకులు దినేష్, పరుశురామ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ సన్నాహక సమావేశం


సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి తదితరులు

అంబర్‌పేట: తెలంగాణ రాష్ట్ర 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన నివాసంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకల కోసం సన్నాహక సమావేశాన్ని నిర్వహించగా.. మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులతో నియోజకవర్గంలో 21 రోజుల పాటు ప్రత్యేక ప్రణాళికతో 10వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు ఈ వేడుకలను విస్తృతంగా చేపడుతామన్నారు. బీఆర్ఎస్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పులిజగన్, సీనియర్ నాయకులు సుశీలరెడ్డి, రమేష్, మురళీకృష్ణ, విజితారెడ్డి, నగేష్‌గౌడ్, జీవన్‌గౌడ్, రాహుల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఐజీ రమేష్‌రెడ్డికి సత్కారం


సత్కరిస్తున్న ప్రదీప్‌రావు

అంబర్‌పేట: ఐజీగా పదోన్నతి పొందిన రమేష్ రెడ్డిని అంబర్‌పేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ప్రదీప్ రావు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. రమేష్‌రెడ్డి గతంలో ఈస్ట్‌జోన్ డీసీపీగా మెరుగైన సేవలందించారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా నీల శ్రీధర్


డాక్టర్ నీల శ్రీధర్

కాచిగూడ: ఆర్యవైశ్య మహాసభ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా డాక్టర్ నీల శ్రీధర్ నియమితులయ్యారు. ఆయనకు నియామకాన్ని హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు లక్ష్మణ్ గుప్తా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల సంక్షేమం, వ్యాపారాభివృద్ధికి వేయి కోట్లతో ప్రభుత్వం ప్రత్యేక వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆర్యవైశ్యులు రాజకీయం, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో రాణించేలా తనవంతు కృషి చేస్తానన్నారు.

నాలా పనుల్లో నాణ్యతా లోపం !

మట్టి సంచుల మీదనే గోడలు కట్టిన వైనం


పద్మకాలనీలో మట్టిసంచులతో నాలాగోడ ఇలా..

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అడిక్‌మెట్ డివిజన్‌లోని పద్మకాలనీలో నిర్మిస్తున్న నాలా ప్రహరీ పనుల్లో నాణ్యత లోపించిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పద్మకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదిగా పనులు కొనసాగుతున్నాయే తప్పా.. పూర్తి కావటం లేదని పలువురు వాపోతున్నారు. మట్టి సంచుల మీదనే గోడలు కడుతున్నారని దీనిపై అధికారులను ప్రశ్నించినా పట్టించుకోవటం లేదని వారు వాపోతున్నారు.

- గోడల కింది భాగంలో మట్టి సంచులే దర్శనమిస్తున్నాయి. ఈ విషయాన్ని నగర మేయర్ దృష్టికి తీసుకెళ్లామని సంబంధిత అధికారులు మాత్రం మట్టి సంచులు కొట్టుకొచ్చాయని బుకాయిస్తున్నారన్నారు. పనుల్లో నాణ్యత లోపించిన విషయాన్ని ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అండ్ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

డ్రైనేజీ పైపులైన్‌కు మరమ్మతులు

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో నూతనంగా వేసిన సీసీ రోడ్డు కారణంగా కంకరరాళ్లు డ్రైనేజీ పైపులైన్‌లో పడిపోవడంతో స్థానికులు నిత్యం డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ సమస్యను మంగళవారం స్థానికులు కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ దృష్టికి తీసుకురాగా.. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ జలమండలి సిబ్బందిని పిలిపించి డ్రైనేజీ పైపులైన్లో నిండిపోయిన కంకరరాళ్లను ఎత్తివేయించి డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. బీజేపీనేతలు వాసు, ఓంప్రకాష్, భీమ్‌రాజ్, బాలప్రసాద్, సూరి, ఎస్.రవియాదవ్, ఆర్.సంతోష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.


చెప్పల్‌బజార్‌లో కంకరను ఎత్తిపోస్తున్న సిబ్బంది